# కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 7వ అధ్యాయము

### వివాహ సమస్యలు, బ్రహ్మచర్యము, పరిత్యాగము

మీరు వ్రాసిన వాటి విషయము:- స్త్రీని ముట్టకుండుట పురుషునికి మేలు. 2 అయినను
జారత్వములు జరుగుచున్నందున ప్రతివానికి సొంత భార్య యుండవలెను, ప్రతి స్త్రీకి సొంత భర్త
యుండవలెను. 3 భర్త భార్యకును, ఆలాగుననే భార్య భర్తకును వారి వారి ధర్మములు నడుపవలెను. 4 భర్తకే
గాని భార్యకు తన దేహముపైని అధికారము లేదు. ఆలాగున భార్యకే గాని భర్తకు తన దేహము పైని
అధికారములేదు. 5 ప్రార్థన చేయుటకు మీకు సావకాశము కలుగునట్లు కొంతకాలము వరకు ఉభయులు
సమ్మతి చొప్పుననే తప్ప ఒకరినొకరు ఎడబాయకుడి మీరు మనస్సు నిలుపలేకపోయినప్పుడు సాతాను
మిమ్మును శోధింపకుండునట్లు తిరిగి కలిసికొనుడి 6 ఇది నా హితోపదేశమే గాని ఆజ్ఞ గాదు. 7
మనుష్యులందరు నావలె ఉండగోరుచున్నాను. అయినను ఒకడొక విధముగను మరియొకడు మరియొక
విధముగను, ప్రతి మనుష్యుడు తనకున్న కృపావరమును దేవుని వలన పొందియున్నాడు. 8 నావలె నుండుట
వారికి మేలని పెండ్లికాని వారితోను విధవరాండ్ర తోను చెప్పుచున్నాను. అయితే మనసు నిలుపలేని యెడల
పెండ్లి చేసుకొన వచ్చును. 9 కామతప్తులగుట కంటె పెండ్లి చేసుకొనుట మేలు. 10 మరియు పెండ్లి
చేసుకొనిన వారికి నేను కాదు, ప్రభువే ఆజ్ఞాపించునదేమనగా – భార్య భర్తను ఎడబాయకుండవలెను. 11
ఎడబాసినయెడల పెండ్లిచేసికొన కుండవలెను, లేదా తన భర్తతో సమాధాన పడవలెను. మరియు భర్త తన
భార్యను పరిత్యజింపకూడదు. 12 ప్రభువు కాదు, నేనే తక్కినవారితో చెప్పునదేమనగా – ఏ సహోదరునికైనను,
అవిశ్వాసురాలైన భార్య యుండగా ఆమె అతనితో కాపురము చేయ నిష్టపడిన యెడల అతడు ఆమెను
పరిత్యజింపకూడదు. 13 మరియు ఏ స్త్రీ కైనను అవిశ్వాసియైన భర్తయుండగాఆమెతో కాపురము చేయ
నిష్టపడిన యెడల ఆమె అతని పరిత్యజింప కూడదు. 14 అవిశ్వాసియైన భర్త భార్యను బట్టి
పరిశుద్ధపరచబడును. అవిశ్వాసూరాలైన భార్య విశ్వాసియైన భర్తను బట్టి పరిశుద్ధ పరచబడును. లేనియెడల
మీ పిల్లలు అపవిత్రులై యుందురు, ఇప్పుడైతే వారు పవిత్రులు. 15 అయితే అవిశ్వాసియైన వాడు ఎడబాసిన
ఎడబాయ వచ్చును అట్టి సందర్భములలో సహోదరునికైనను సహోదరికైనను నిర్బంధము లేదు.
సమాధానముగా ఉండుటకు దేవుడు మనలను పిలిచియున్నాడు. 16 ఓ స్త్రీ, నీ భర్తను రక్షించెదవో లేదో
నీకేమి తెలియును ? ఓ పురుషుడా, నీ భార్యను రక్షించెదవో లేదో నీకేమి తెలియును ? 17 అయితే ప్రభువు
ప్రతివానికి ఏ స్థితి నియమించెనో దేవుడు ప్రతివానిని ఏ స్థితి యందు పిలిచెనో ఆ స్థితి యందే
నడుచుకొనవలెను. ఈ ప్రకారమే సంఘములన్నిటిలో నియమించుచున్నాను. 18 సున్నతి పొందినవాడెవడైనను
పిలువబడెనా ? అతడు సున్నతి పోగొట్టుకొనవలదు. సున్నతి పొందని వాడెవడైనను పిలువబడెనా? సున్నతి
పొందవలదు. 19 దేవుని ఆజ్ఞలను అనుసరించుటయే ముఖ్యము గాని సున్నతి పొందుట యందేమియు లేదు,
సున్నతి పొందక పోవుటయందు ఏమియు లేదు. 20 ప్రతివాడు ఏ స్థితిలో పిలువబడెనో ఆ స్థితి లోనే
ఉండవలెను. 21 దాసుడవై యుండగా పిలువబడితివా? చింత పడవద్దు గాని, స్వతంత్రుడవగుటకు శక్తి
కలిగిన యెడల స్వతంత్రుడవగుట మరి మంచిది. 22 ప్రభువునందు పిలువబడిన దాసుడు ప్రభువు వలన
స్వాతంత్ర్యము పొందినవాడు. ఆ ప్రకారమే స్వతంత్రుడై యుండగాపిలువబడిన వాడు క్రీస్తు దాసుడు. 23 మీరు
విలువబెట్టి కొనబడినవారు గనుక మనుష్యులకు దాసులు కాకుడి 24 సహోదరులారా, ప్రతి మనుష్యుడును

ఏ స్థితిలో పిలువబడెనో ఆ స్థితిలోనే దేవునితో సహవాసము కలిగి ఉండవలెను. 25 కన్యకల విషయమై ప్రభువు యొక్క ఆజ్ఞ నేను పొందలేదు గాని, నమ్మకమైన వాడనై యుండుటకు ప్రభువు వలన కనికరము పొందినవాడనై, నా తాత్పర్యము చెప్పుచున్నాను. 26 ఇప్పటి ఇబ్బందిని బట్టి పురుషుడు తానున్న స్థితిలోనే యుండుట మేలని తలంచుచున్నాను. 27 భార్యకు బద్ధుడవై యుంటివా ? విడుదల కోరవద్దు. భార్యలేక విడిగానుంటివా ? వివాహము కోరవద్దు. 28 అయినను నీవు పెండ్లిచేసుకొనినను పాపములేదు. కన్యక పెండ్లిచేసుకొనినను ఆమెకు పాపము లేదు. అయితే అట్టి వారికి శరీర సంబంధమైన శ్రమలు కలుగును అవి మీకు కలుగకుండవలెనని కోరుచున్నాను. 29 సహోదరులారా, నేను చెప్పునదేమనగా– కాలము సంకుచితమై యున్నది గనుక ఇక మీదట భార్యలు కలిగిన వారు భార్యలు లేనట్టును, 30 ఏడ్చువారు ఏడ్వనట్టును, సంతోషపడువారు సంతోషపడనట్టును, కొనువారు తాము కొనినది తమది కానట్టును, 31 ఈ లోకము అనుభవించువారు అమితముగా అనుభవింపనట్టును ఉండవలెను, ఏలయనగా ఈ లోకపు నటన గతించుచున్నది. 32 మీరు చింత లేనివారై యుండవలెనని కోరుచున్నాను. పెండ్లికానివాడు ప్రభువును ఏలాగు సంతోషపెట్టగునని ప్రభువు విషయమైన కార్యములను గూర్చి చింతించుచున్నాడు. 33 పెండ్లిఅయినవాడు భార్యను ఏలాగు సంతోషపెట్టగునని లోక విషయమైన వాటిని గూర్చి చింతించుచున్నాడు. 34 అటువలెనే పెండ్లికాని స్త్రీయు, కన్యకయు తాము శరీరమందును ఆత్మ యందును పవిత్రురాండ్రై యుండుటకు ప్రభువు విషయమైన కార్యములను గూర్చి చింతించుచుందురు గాని, పెండ్లియైనది భర్తను ఏలాగు సంతోష పెట్టగునని లోక విషయమైన వాటిని గూర్చి చింతించుచున్నది. 35 మీకు ఉరి యొడ్డవలెనని కాదు గాని మీరు యోగ్య ప్రవర్తనులై, తొందర ఏమియు లేక ప్రభువు సన్నిధాన వర్తనులై ఉండవలెనని ఇది మీ ప్రయోజనము నిమిత్తమే చెప్పుచున్నాను. 36 అయితే ఒకని కుమార్తెకు ఈడు మించిపోయిన యెడలను, ఆమెకు వివాహము చేయవలసి వచ్చిన యెడలను ఆమెకు వివాహము చేయక పోవుట యోగ్యమైనది కాదని ఒకడు తలంచిన యెడలను, అతడు తన ఇష్టము చొప్పున పెండ్లిచేయవచ్చును. అందులో పాపము లేదు. ఆమె పెండ్లిచేసుకొనవచ్చును. 37 ఎవడైనను తన కుమార్తెకు పెండ్లిచేయనవసరము లేకయుండగాఅతడు స్థిరచిత్తుడును తన ఇష్ట ప్రకారము జరుప శక్తి గలవాడునై, ఆమెను వివాహము లేకుండా ఉంచవలెనని తన మనస్సులో నిశ్చయించుకొనిన యెడల బాగుగా ప్రవర్తించుచున్నాడు. 38 కాబట్టి తన కుమార్తెకు పెండ్లి చేయువాడు బాగుగా ప్రవర్తించుచున్నాడు, పెండ్లిచేయనివాడు మరి బాగుగా ప్రవర్తించుచున్నాడు. 39 భార్య తన భర్త బ్రతికియున్నంతకాలము బద్ధురాలై యుండును, భర్త మృతి పొందిన యెడల ఆమె కిష్టమైన వానిని పెండ్లిచేసుకొనుటకు స్వతంత్రురాలై యుండును గాని ప్రభువు నందు మాత్రమే పెండ్లిచేసుకొనవలెను. 40 అయితే ఆమె విధవరాలిగా ఉండినయెడల మరి ధన్యురాలని నా అభిప్రాయము. దేవుని ఆత్మ నాకును కలిగియున్నదని తలంచుకొనుచున్నాను.